

విహారయాత్రలో విషాదం
కృష్ణా పరివాహకంలో నీట మునిగి యువకుడి మృతి
నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలంలో ఘటన
మృతుడు సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌వాసి 6
రెండేళ్లుగా బడికి తాళం 7

ఆలయాలకు ఏకాదశి శోభ

తెలుగువారి మొదటి పండుగ తొలి ఏకాదశి పర్వదినాన్ని ఆదివారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఏడాదిలోని ఇరవైనాలుగు ఏకాదశుల్లో.. ఆషాఢ శుద్ధ ఏకాదశి మొదటిది. శ్రీమన్నారాయణుడికి అత్యంత ప్రీతిపాత్రమైన ఈ రోజున తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. దైవ దర్శనం చేస్తున్నారు.

-మెదక్ అర్బన్/సంగారెడ్డి రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి)



సంగారెడ్డి వైకుంఠపురంలో బారులు తీరిన భక్తులు

సంగారెడ్డి మొహర్రంలో పాల్గొన్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన మొహర్రం కార్యక్రమాల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని ఆయా విధుల్లో నిర్వహించిన పీర్ల ఊరేగింపులో ఆయన పాల్గొన్నారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన జగ్గారెడ్డిని ముస్లిం మత గురువులు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ మొహర్రంను పురస్కరించుకొని నిర్వహించే పీర్ల ఊరేగింపులో ప్రతీ ఏటా పాల్గొంటానని స్పష్టం చేశారు. మత సామరస్యానికి ప్రతీకగా ప్రజలు మొహర్రంను జరుపుకుంటారని తెలిపారు. అన్నీ మతాల ప్రజలు ఉత్సాహంగా పాల్గొని మతసామరస్యాన్ని చాటుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు షఫియొద్దీన్ పాల్గొన్నారు.



దర్గాలో జగ్గారెడ్డిని ఆశీర్వదిస్తున్న ముస్లిం మత గురువులు



సంగారెడ్డిలో జరిగిన పీర్ల ఊరేగింపులో పాల్గొన్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సంగారెడ్డి పశువైద్యశాలలో శునకానికి టీకా వేస్తున్న జేడీ వసంతకుమారి

రేబీస్ వ్యాధి ప్రబలకుండా టీకాలు వేయించాలి

పశుసంవర్ధక శాఖ జేడీ

సంగారెడ్డి రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రేబీస్ వ్యాధి ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని ప్రతీ ఒక్కరు పెంపుడు కుక్కలకు విధిగా టీకాలు వేయించాలని పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ వసంతకుమారి సూచించారు. సంగారెడ్డిలోని పశువైద్యశాలలో జూనోసిస్ డే సందర్భంగా ఆదివారం శునకానికి టీకా వేసి కార్యక్రమాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు. జంతువులు, పశు పక్ష్యాదుల ద్వారా మానవులకు సోకే వ్యాధులను జూనోసిస్ వ్యాధులంటారని, ప్రతీ సంవత్సరం జూలై 6వ తేదీన పశువులకు జూనోసిస్ వ్యాధులు ప్రబలకుండా టీకాలు వేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డా. మునీర్ అహ్మద్, డా. పవనర్, డా.అజిత్ చంద్ర, కనకలక్ష్మీ, సిబ్బంది ఉస్మాన్, శోభ, శ్రీయ, అఏఖ్య తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి రోడ్లకు మహర్దశ

రూ. 83.94 కోట్లు విడుదల

రూ. 12 కోట్లతో జిల్లా కేంద్రంలో బైపాస్ రోడ్డు విస్తరణ

గ్రామీణ రహదారులకు మరమ్మతులు

ముమ్మరంగా సాగుతున్న పనులు

సంగారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులకు మహర్దశ పట్టనున్నది. రహదారుల పునర్‌నిర్మాణం, మరమ్మతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రూ.83.94కోట్లు మంజూరు చేసింది. ఇందుకోసం రోడ్లు భవనాల శాఖ, పంచాయతీరాజ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నుంచి నిధులను మంజూరు చేసింది. జిల్లా కేంద్రంలోని నాలుగు రోడ్లతో పాటు కంది, కొండాపూర్, సదాశివపేట, సంగారెడ్డి మండలాల పరిధిలోని పలు గ్రామాలకు రోడ్లను తారు రోడ్లుగా మార్చనున్నారు. టెండర్లు, అగ్రిమెంట్ ప్రక్రియ పూర్తి కావడంతో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.



కొనసాగుతున్న సంగారెడ్డి బైపాస్‌రోడ్డు విస్తరణ పనులు

సంగారెడ్డి టౌన్. జూలై 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో రోడ్ల విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. పట్టణంలో అత్యంత రద్దీగా ఉండే బైపాస్ రోడ్డును విస్తరించి, సెంట్రల్ లైటింగ్, డివైడర్ ఏర్పాటు చేయడం కోసం రూ.12 కోట్లు కేటాయించారు. ఈ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఐటీఐ నుంచి గొల్లగూడెం వరకు 80 ఫీట్ల రోడ్డు, నటరాజ్ థియేటర్ నుంచి కల్వకుంట మీదుగా ఐబీటీ వరకు 80 ఫీట్ల రోడ్డు, రుక్మిణి థియేటర్ నుంచి చింతలపల్లి, కిష్టయ్యగూడెం, రాజంపేట నుంచి డీఎస్పీ కార్యాలయం మీదుగా మల్కాపూర్ చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ పనులు కూడా చేపట్టనున్నారు. ఇందిరాపార్కు అభివృద్ధి కోసం ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, హెచ్ఎండీఏల నుంచి విడివిడిగా రూ.12 కోట్లు మంజూరయ్యాయి. పట్టణంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని రైతువేదిక నుంచి కలివేముల, ఓడీఎఫ్ రోడ్డుకు అనుసంధానం చేస్తూ మరో కొత్త రోడ్డు నిర్మాణానికి రూ.4కోట్లు కేటాయించగా పనులను ఇప్పటికే ప్రారంభించారు.

గ్రామీణ రహదారుల అభివృద్ధికి నిధులు

నియోజకవర్గంలోని గ్రామీణ రహదారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద రూ.60 కోట్లు మంజూరు చేసింది. సంగారెడ్డి, సదాశివపేట, కంది, కొండాపూర్ మండలాల్లోని 80 గ్రామాలకు రూ.5 లక్షల చొప్పున రూ.4 కోట్లు మంజూరు చేశారు. నాలుగు మండలాల్లోని గ్రామాలకు రూ.3.50 కోట్లు, సీసీ రోడ్లు, ఫార్మేషన్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం రూ. 2.35 కోట్లు కేటాయించారు. నాలుగు మండలాల్లోని నాలుగు ప్రధాన రోడ్లు, మరమ్మతుల కోసం రూ.14.99 కోట్లు మంజూరు చేశారు. చౌటకూర్ మండలం తాడ్దానిపల్లి చౌరస్తా నుంచి మునిపల్లి మండలం మల్లారెడ్డిపేట వరకు బీటీ రోడ్డు కోసం రూ. 15 లక్షలు, కొండాపూర్ మండలం మల్లేపల్లి, తెర్పోల్ మీదుగా మండలకేంద్రం వరకు ఏడు కిలోమీటర్లు రోడ్డు నిర్మాణం కోసం రూ.15 లక్షలు మంజూరు చేసింది. ఈ పనులు పూర్తయితే ప్రజలకు దూరభారం తగ్గనున్నది.

జిల్లాలో మూడు కొత్త ఆస్పత్రులు

- ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం
- సర్కారు ఆస్పత్రుల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు
- డీసీహెచ్ఎస్ కె.సంగారెడ్డి



డాక్టర్ సంగారెడ్డి

సంగారెడ్డి అర్బన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్తగా మూడు ఆస్పత్రుల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలంగాణ వైద్య విధాన పరిషత్ డీసీహెచ్ఎస్ డాక్టర్ కె.సంగారెడ్డి తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలను వెల్లడించారు.

ఫటాఫట్

జిల్లాలో వైద్య విధాన పరిషత్ పరిధిలో ఎన్ని ఆస్పత్రులున్నాయి? కొత్తగా ఏమైనా ఆస్పత్రులు ఏర్పాటు చేస్తున్నారా?

జిల్లాలో నాలుగు ఏరియా ఆస్పత్రులు, ఐదు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్నాయి. తెల్లాపూర్, కంగ్టిలో ఆస్పత్రుల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాం. గుమ్మడిదల-నర్సాపూర్ మధ్య జాతీయ రహదారిపై ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. స్వలంగా వైద్యులు, సిబ్బంది కొరత ఉన్నా సమన్వయంతో వైద్య సేవలందిస్తున్నాం. అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

సర్కారు ఆస్పత్రుల్లో అన్ని సౌకర్యాలున్నాయా?

ఆస్పత్రుల్లో సమస్యలను గుర్తిస్తే ప్రభుత్వం, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. రోగులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. కరెంట్ పోయినప్పుడు ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. పేదలకు మెరుగైన వైద్యం అందిన్నారు. సర్కారు వైద్యంపై ప్రజల్లో నమ్మకం, భరోసా కలిగిస్తున్నాం.

సీజనల్ వ్యాధుల నివారణకు ఏం సూచనలు చేస్తారు?

అన్ని ఏరియా ఆస్పత్రులు, సీహెచ్‌సీల్లో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ నివారణ కిట్లు అందుబాటులో ఉన్నాయి. జ్వరం వస్తే అశ్రద్ధం చేయకుండా సమీపంలోని సర్కారు ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించారు. పరీక్షలు చేయించుకుని చికిత్స తీసుకుకోవాలి. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి.

బిల్లుల బకాయిలతో బెంబేలు!

మధ్యాహ్న భోజన కార్మికుల కష్టాలు

మెదక్ జిల్లాలో రూ.1.70 కోట్ల బిల్లులు పెండింగ్

అప్పులు చేసి సరుకులు తెస్తున్న నిర్వాహకులు



రామాయంపేటలో ఆరుబయట వంట చేస్తున్న నిర్వాహకులు

రామాయంపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో మధ్యాహ్న భోజన పథకం కింద పనిచేస్తున్న మహిళా కార్మికులు బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఆరు నెలలుగా బకాయిలు విడుదల కాకపోవడంతో వారు ఆగమవుతున్నారు. మెదక్ జిల్లాలో 260 పాఠశాలలకు అక్షయపాత్ర నుంచి మధ్యాహ్న భోజనం సరఫరా అవుతున్నది. మరో 884 ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 68 వేల మంది విద్యార్థులకు స్వయం సహాయక సంఘాలకు చెందిన 1,421 మంది మహిళలు మధ్యాహ్న భోజనం వండి పెడుతున్నారు. ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు మధ్యాహ్న భోజన ఖర్చులో 60 శాతం కేంద్ర ప్రభుత్వం భరిస్తుండగా, రాష్ట్రం వాటా 40 శాతం మాత్రమే. 9, 10 తరగతులకు సంబంధించిన పూర్తి ఖర్చు రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. వంట కార్మికులకు నెలకు రూ. 3వేల వేతనం ఇస్తున్నారు. ప్రభుత్వం ప్రతీ నెల వేతనం చెల్లిస్తున్నా వంట సరుకుల బిల్లులు చెల్లించడం లేదు. ఇందుకు సంబంధించిన రూ.1.70 కోట్లు ఇంకా బకాయి ఉన్నది. సరుకుల కోసం ప్రభుత్వం కోసం డబ్బులు రాకపోయినా ప్రతీ నిత్యం మహిళలు కిరాణా సామగ్రి, కోడిగుడ్లు సొంత డబ్బులతో తీసుకొచ్చి వంటలు సిద్ధం చేసి వడ్డిస్తున్నారు. ఆరు నెలలకు పైగా బిల్లులు రాకపోవడంతో చాలా చోట్ల వంటలు మానేయాల్సి వస్తోంది. దీంతో అక్షయపాత్ర సంస్థనే ఆయా పాఠశాలల్లో ఆహారం సరఫరా చేస్తోంది. అనేకచోట్ల వంట షెడ్లు లేకపోవడంతో కార్మికులు ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ ఆరుబయటే వంటలు చేస్తున్నారు.

కూలి కూడా గిట్టుబాటు కావడం లేదు



రోజూ వంటలు చేసి వడ్డిస్తే కూలీ కూడా గిట్టుబాటు కావడం లేదు. ఎక్కడ కూలీ పనులు చేసుకున్నా బాగుపడతాం. ఈ కడుపు నింపే కష్టాన్ని ఇక మేము చేయలేం.

-కళావతి, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు, రామాయంపేట

అప్పు చేసి సరుకులు తెస్తున్నా



ప్రభుత్వం ఆరు నెలలుగా బిల్లులు ఇవ్వడం లేదు. మా మెడలోని నగలు కుదువబెట్టి అప్పులు తెచ్చి వంట సరుకులు కొనుగోలు చేసి తీసుకువచ్చి వండి పెడుతున్నాం.

-చిలుక లక్ష్మి, రామాయంపేట

త్వరలోనే బిల్లుల విడుదల

మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు కొన్ని నెలలుగా బకాయిలు ఉన్నమాట వాస్తవం. పెండింగ్‌లో ఉన్న బిల్లులను ప్రభుత్వం త్వరలోనే విడుదల చేయనుందని సమాచారం. నిధులు రాగానే బిల్లులు చెల్లిస్తాం.

-రాధా కిషన్, మెదక్ డీఈవో

పర్యాటకంపై ఆర్టీసీ నజర్

- పుణ్యక్షేత్రాలకు స్పెషల్ బస్సులు
- ప్రయాణికులను ఆకర్షించే ప్యాకేజీలు



మెదక్-అరుణాచలం వెళ్తున్న స్పెషల్ బస్సు (ఫైల్)

మెదక్ అర్బన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్యాకేజీలపై ఆర్టీసీ దృష్టిసారించింది. ఆదాయ వనరులు పెంచుకోవడంలో భాగంగా పలు టూరిస్ట్ ప్యాకేజీలను ప్రకటించింది. పర్యాటక ప్రాంతాలతో పాటు ఆధ్యాత్మిక క్షేత్రాలకు స్పెషల్ సర్వీసులను నడిపిస్తోంది. మెదక్, నర్సాపూర్ నుంచి అరుణాచలం, కాణిపాకం, కంచి, గోల్డెన్ టెంపుల్, శ్రీ జోగులాంబ దేవి శక్తిపీఠం, నాచారం, వర్గల్, కొమురవెల్లి, యాదగిరి గుట్ట, సురేంద్రపురి, రామమేశ్వర, స్వర్ణగిరి వంటి పుణ్యక్షేత్రాలకు బస్సులు నడపనున్నారు.

స్పెషల్ సర్వీసులు ఇవే

స్పెషల్ టూర్ ప్యాకేజీ కింద ప్రతీ శుక్రవారం, శనివారం సప్తపుణ్యక్షేత్రాల బస్సును నడపనున్నారు. ఇవి కాకుండా..

- ఈ నెల 8న మెదక్, నర్సాపూర్ డిపోల నుంచి అరుణాచలానికి ఉదయం 6 గంటలకు ప్రత్యేక బస్సులు బయలుదేరనున్నాయి. నాలుగు రోజుల యాత్ర అనంతరం 11వ తేదీ రాత్రి తిరిగి మెదక్, నర్సాపూర్ చేరుకుంటాయి.
- ఈ నెల 8న ఉదయం ఉదయం 5 గంటలకు మెదక్ నుంచి బయలుదేరి నాచారం, వర్గల్, కొమురవెల్లి, యాదగిరి గుట్ట, సురేంద్రపురి, రామమేశ్వర, స్వర్ణగిరి దర్శనం చేసుకొని తిరిగి అదే రోజు రాత్రి మెదక్ చేరుకుంటుంది. అరుణచలం ప్యాకేజీ పెద్దలకు రూ.4వేలు, పిల్లలకు రూ.2,800 చార్జి చేయనున్నారు. ఒక రోజు టూర్ ప్యాకేజీలకు పెద్దలకు రూ.560, పిల్లలకు రూ.280 వసూలు చేయనున్నారు. మరిన్ని వివరాలకు 7382830420, 9494825746, 9963275868, 7780775815 నంబర్లలో సంప్రదించాలని మెదక్ డిపో మేనేజర్ సురేఖ పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్‌పై దాడి
ముగ్గురు యువకులపై కేసు 6

సిగాచి యాజమాన్యంపై క్రిమినల్ కేసు పెట్టాలి
జాతీయ, రాష్ట్ర కార్మిక సంఘాల నాయకులు 6

మెరుగైన విద్య, నాణ్యమైన భోజనం

గురుకులాలు, వసతిగృహాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ : మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



విద్యార్థినులను ప్రశ్నలు అడుగుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

వెల్దుర్తి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. ఆదివారం వెల్దుర్తిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. రిజిస్టర్లు, సరుకులు, భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అంతకుముందు తరగతి గదులను సందర్శించి విద్యార్థినుల అభ్యసనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, గురుకులాలు, వసతిగృహాల్లో సౌకర్యాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ వంటి సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని తెలిపారు. గుణాత్మక విద్య కోసం 7-9 తరగతుల విద్యార్థులకు గ్రౌండ్ బేస్ లెర్నింగ్ కార్యక్రమాన్ని అమలు చేశామని పేర్కొన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ప్రాథమిక విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు.

ఆస్పత్రులపై నమ్మకాన్ని పెంచాలి

అనంతరం వెల్దుర్తి పీహెచ్‌సీని కలెక్టర్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి వైద్యులు అందిస్తున్న సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్యా కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో అందిస్తున్న సేవలపై నమ్మకాన్ని పెంపొందించాలని సూచించారు. సమయపాలన పాటించాలని చెప్పారు.

సంగారెడ్డి జిల్లాలో 21 కొత్త పాఠశాలలు

మంజూరు చేస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు

తక్షణమే ప్రారంభించాలని ఆదేశాలు

సంగారెడ్డి అర్బన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో కొత్తగా 21 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను మంజూరు చేస్తూ విద్యాశాఖ డైరెక్టర్ నవీన్‌నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని సంగారెడ్డి పట్టణంలో నాలుగు, సదాశివపేటలో ఒకటి, జహీరాబాద్‌లో పది, తెల్లాపూర్‌లో నాలుగు, రాయికోడ్‌లో రెండు కొత్త ప్రభుత్వ పాఠశాలల ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు వెలువరించారు. ఇటీవల పాఠశాల విద్యాశాఖ ఎక్కడెక్కడ కొత్త బడులు అవసరమో సర్వే చేసి నివేదిక పంపాలని డీఈవోలను ఆదేశించింది. ఈమేరకు క్షేత్రస్థాయి పరిశీలించిన అనంతరం అధికారులు నివేదిక పంపారు.

ఒకటి అడిగితే నాలుగు ఇచ్చారు

సంగారెడ్డి పట్టణంలో బృందావన్‌కాలనీ, గీతానగర్, ఓడీఎఫ్ కాలనీ, ప్రగతి నగర్ కాలనీలకు కలిపి ఒక ప్రాథమిక పాఠశాల అవసరమని ప్రతిపాదనలు పంపితే, ఏకంగా నాలుగు కాలనీలకు ఒక్కోటి చొప్పున నాలుగు స్కూల్స్ మంజూరు చేశారు. తెల్లాపూర్‌లో మూడు పాఠశాలలు అవసరమని కోరితే నాలుగు మంజూరు చేశారు. రాయికోడ్‌లో ఒకటి కావాలని కోరితే రెండు మంజూరు చేశారు. అడిగిన దానికంటే ఎక్కువ మంజూరు చేయడంతో జిల్లా విద్యాశాఖ వర్గాల్లో అయోమయం నెలకొన్నది. ఏంచేయాలని మల్లగుల్లాలు పడుతున్నారు.

తక్షణమే ప్రారంభించాలని ఆదేశాలు

ప్రభుత్వం తాజాగా మంజూరు చేసిన సర్కారు బడులను తక్షణమే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖను ఆదేశించింది. విద్యాశాఖ అధికారులు ఈ దిశగా చర్యలు ప్రారంభించారు. ప్రస్తుతానికి కాలనీల్లో సర్కారు భవనం అందుబాటులో లేకపోతే అద్దె భవనంలో తాత్కాలికంగా పాఠశాల ప్రారంభించాలని నిర్ణయించారు. అవసరమైన ఉపాధ్యాయులను ఇతర పాఠశాలల నుంచి తాత్కాలికంగా సర్దుబాటు చేయనున్నారు. పాఠశాలలో అవసరమైన ఫర్నిచర్, విద్యాసామగ్రి తదితర సామగ్రిని కలెక్టర్ ద్వారా విద్యాశాఖ సమకూర్చనున్నది.

నేడు హుస్నాబాద్‌కు మంత్రి వాకిటి శ్రీహరి

హుస్నాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు క్రీడలు, పశుసంవర్థక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సోమవారం మధ్యాహ్నం హుస్నాబాద్‌లో పర్యటించనున్నట్లు మంత్రి క్యాంపు కార్యాలయ వర్గాలు తెలిపాయి. వీరితో పాటు స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి వస్తున్నారని చెప్పారు. వీరు హుస్నాబాద్‌లోని మినీ స్టేడియాన్ని సందర్శిస్తారని పేర్కొన్నారు. యువకులు, క్రీడాకారులు పెద్దఎత్తున ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

అదృశ్యం కేసులో తల్లి, కూతురు ఆచూకీ లభ్యం

● తండ్రి కోసం వెతుకుతున్న పోలీసులు, కుటుంబీకులు

రామాయంపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : గొడవ పడి ఇంట్లో నుంచి వెళ్లిన దంపతుల్లో భార్య, కూతురు ఆచూకీ లభించింది. భర్త జాడ దొరకలేదు. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయిలాపూర్‌కు చెందిన ప్రేమ్‌కుమార్, ప్రియ శనివారం సాయంత్రం గొడవ పడ్డారు. అదేరోజు రాత్రి ప్రేమ్‌కుమార్ ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. ప్రియ తన మూడేళ్ల కూతురును తీసుకుని ఇంటి నుంచి వెళ్లింది. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో ప్రేమ్‌కుమార్‌ తండ్రి సాయిలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆదివారం ప్రియ తన పాపతో తల్లిగారి ఊరైన జనగామలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రేమ్ కుమార్ ఆచూకీ లభించకపోవడంతో కుటుంబీకులు, పోలీసులు వెతుకుతున్నారు.

సిగాచి యాజమాన్యంపై క్రిమినల్ కేసు పెట్టాలి

● హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలి

● జాతీయ, రాష్ట్ర కార్మిక సంఘాల నాయకులు

పటాన్‌చెరు రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి) : సిగాచి పరిశ్రమ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టి తక్షణమే అరెస్టు చేయాలని, మృతి చెందిన కార్మిక కుటుంబాలకు రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలని, హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యం, బీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారయ్య, టీఎన్టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు బోస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పాశమైలారం సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై జాతీయ, రాష్ట్ర కార్మిక సంఘాల నాయకులు బాధిత కుటుంబాలను పరామర్శించి అనంతరం పరిశ్రమ సందర్శించారు. పోలీసులు అడ్డుకోవడంతో పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఆ తర్వాత పోలీసులు వారిని లోనికి అనుమతించారు. అక్కడే ఉన్న జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌తో మాట్లాడారు. అందరికీ న్యాయం జరిగే విధంగా చూస్తామని నాయకులతో అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమలను తనిఖీ చేయకుండా యాజమాన్యాలకు అనుకూలంగా చట్టాల్లో మార్పులు చేస్తున్నారన్నారు. ఈ ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అలాగే పరిశ్రమ వద్ద ఐఎన్‌టీయూసీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ సభ్యుల బృందం ప్రమాద స్థలాన్ని సందర్శించారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడారు. పరిశ్రమను సందర్శించిన వారిలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమ, కార్యదర్శి ఉప్పల శ్రీకాంత్ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజయ్య, పలువురు ఉన్నారు.



పరిశ్రమ వద్ద పోలీసులతో మాట్లాడుతున్న నాయకులు

గోడను ఢీకొట్టి ఇద్దరు యువకులు మృతి

● పల్సర్‌పై ఓవర్ స్పీడ్, మద్యం మత్తే కారణం!

● పండుగ పూట తంగళ్లపల్లిలో విషాదం

కోహెడ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కోహెడ మండలం తంగళ్లపల్లిలో ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. గ్రామానికి చెందిన బోదాసు శ్రీకాంత్ (22) దామెర రిషి (15) పల్సర్‌పై తంగళ్లపల్లి గ్రామం నుంచి కోహెడకు వెళ్తుండగా ఊరి చివర ఉన్న ఓ ఇంటి గోడను వేగంగా ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. వర్షం పడుతుండడం, మద్యం మత్తులో ఓవర్ స్పీడ్‌గా వెళ్లడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు గ్రామస్థులు భావిస్తున్నారు. పోలీసులకు సమాచారం అందించారు. ఏకాదశి రోజు ఇద్దరు యువకులు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్‌పై దాడి

● ముగ్గురు యువకులపై కేసు

సిద్దిపేట క్రైం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు యువకులు ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌పై దాడి చేసిన సంఘటన సిద్దిపేటలో ఆదివారం చోటుచేసుకుంది. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేములవాడ డిపోకు చెందిన టీఎస్ 02 యూసీ 5434 నంబర్ గల ఆర్టీసీ బస్సు ఆదివారం వేములవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తుంది. గుర్రాలగొంది స్టేజీ లో బస్సును కొంచెం ముందుకు ఆపి ప్రయాణికులకు ఎక్కించుకునే క్రమంలో ఒకతను బూతులు తిడుతూ దాడి చేసే ప్రయత్నం చేస్తే ప్రయాణికులు అతన్ని వారించారు. కాసేపటికి అతను బస్సు దిగాడు. గుర్రాలగొంది నుంచి సిద్దిపేట కొత్త బస్టాండ్‌కు వచ్చే సరికి గుర్రాలగొందికి చెందిన ముగ్గురు యువకులు పి.గణేష్, ఎన్.నగేష్‌గౌడ్, ఎస్.సతీష్ మద్యం మత్తులో బస్సు డ్రైవర్‌ను కొట్టారు. ఇదంతా వీడియో తీస్తున్న కండక్టర్ కొమురయ్యపై కూడా దాడి చేసి అతని మొబైల్ పగలగొట్టారు. విషయం తెలుసుకున్న కంట్రోలర్ యాదయ్య, సెక్యూరిటీ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. అనంతరం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో డ్రైవర్, కండక్టర్ ఫిర్యాదు చేశారు.

హుస్నాబాద్‌లో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేయాలి

హుస్నాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): అత్యధికంగా క్రీడాకారులున్న హుస్నాబాద్‌లో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేయాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి క్రీడలశాఖ మంత్రి వాకిటి శ్రీహరిని కోరారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ దీని కోసం కృషి చేయాలన్నారు. హుస్నాబాద్ ప్రాంతం నుంచి జాతీయ స్థాయికి ఎదిగిన క్రీడాకారులున్నారని, విద్యార్థులు క్రీడల్లో రాణించడానికి స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేయడమే కాకుండా ఇక్కడి మినీ స్టేడియాన్ని అభివృద్ధి చేయాలన్నారు.

విహారయాత్రలో విషాదం

● నీట మునిగి యువకుడి మృతి

● నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలంలో ఘటన

● మృతుడు సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌వాసి



అనిల్ కుమార్

నేరేడుగొమ్ము, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి పర్వదినాన విహారయాత్రలో విషాదం నెలకొన్నది. నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం వైజాగ్‌కాలనీ కృష్ణా పరివాహక ప్రాంతంలో నీటి మునిగి యువకుడు మృతి చెందాడు. ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, మృతుడి బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం తెల్లాపూర్ గ్రామానికి చెందిన మచ్చికల అనిల్‌కుమార్(23) డీజే ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. తొలి ఏకాదశి పర్వదినం, ఆదివారం సెలవు రోజు కావడంతో అదే గ్రామానికి చెందిన స్నేహితులు దుర్గా ప్రసాద్, గణేష్‌తో కలిసి కారులో ఆదివారం తెల్లవారుజామున నేరేడుగొమ్ము మండలంలోని వైజాగ్‌కాలనీకి చేరుకున్నారు. కొద్దిసేపు కారులో విశ్రాంతి తీసుకుని అనంతరం అక్కడే పర్యాటక ప్రాంతాలను వీక్షించారు. ఈత కోసం కృష్ణా పరివాహక ప్రాంతానికి వెళ్లారు. అనిల్‌కుమార్ కొద్దిదూరం వెళ్లాక నీటిలో మునిగి గల్లంతయ్యాడు. గమనించిన మిత్రులు ఆందోళనతో కేకలు వేయడంతో మత్స్యకారులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మత్స్యకారుల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టగా సాయంత్రం అనిల్‌కుమార్ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సోదరుడు మృతిచెందాడని తెలుసుకున్న అనిల్ సోదరులు శద్రక్, జాన్సన్ దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు. మృతుల సోదరులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. విహారయాత్రకు స్నేహితులతో కలిసి వచ్చి కృష్ణానదిలో నీట మునిగి మృతి చెందడంతో మిత్రులతోపాటు కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూమిని సాగు చేస్తున్న మాజీ ప్రజాప్రతినిధి

● అడ్డుకున్న గ్రామస్థులు.. అధికారులకు ఫిర్యాదు

కొల్చారం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూమిని ఓ ప్రజాప్రతినిధి సాగు చేస్తుండడంతో గ్రామస్థులు ఆదివారం అడ్డుకున్నారు. కొల్చారం మండలం రాంపూర్‌కు చెందిన ఓ ప్రజాప్రతినిధి గతంలోనే ప్రభుత్వ భూమిలో సాగు చేస్తుండడంతో గ్రామస్థులు కలెక్టర్ ఫిర్యాదు చేశారు. స్పందించిన రెవెన్యూ అధికారులు మూడు నెలల క్రితం తహసీల్దార్ ఆధ్వర్యంలో సుమారు ఆరు ఎకరాలకు సంబంధించి "ఇది ప్రభుత్వ భూమి. ఎవరూ సాగు చేయవద్దని బోర్డులను పాతారు." అయినా కూడా సదరు ప్రజాప్రతినిధి ఆదివారం మరోసారి ఆ భూమిలో ట్రాక్టర్‌తో చదును చేయడంతో గ్రామస్థులు అడ్డుకున్నారు. వారిపై ఇష్టానుసారంగా బూతులు తిట్టడంతో వారు రెవెన్యూ అధికారులకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు.

మల్లన్న సన్నిధికి పోటెత్తిన భక్తజనం

చేర్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయ సందర్శనార్థం ఆదివారం భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తజనసందోహంగా మారాయి. స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుని పులకించిపోయారు. నిత్య కల్యాణంలో పాల్గొన్నారు. తమ కోర్కెలు ఈడేర్చమని వేడుకుంటూ గంగిరేగు చెట్టుకు ముడుపులు కట్టారు. స్వామి వారి దర్శనంకోసం సుమారు 2 గంటల సమయం పట్టింది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో అన్నపూర్ణ, ఆలయ ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్‌లు సురేందర్ రెడ్డి, శ్రీరాములు తదితరులు పర్యవేక్షించారు.



గంగిరేగుచెట్టు ప్రాంగణంలో భక్తులు

అథ్లెటిక్స్‌లో సిద్దిపేట జిల్లాకు రెండు పతకాలు



బంగారు పతకాన్ని అందుకున్న క్రీడాకారుడు గాడిచర్ల జితీష్



కాంస్య పతకాన్ని అందుకున్న పునీత్ గౌడ్

సిద్దిపేట క్రైమ్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): హన్మకొండలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో సిద్దిపేట జిల్లాకు రెండు పతకాలు దక్కాయి. అండర్-10 బాలుర విభాగంలో జిల్లాకు చెందిన క్రీడాకారుడు గాడిచర్ల జితీష్ స్టాండింగ్ బ్రాడ్ జంప్‌లో బంగారు పతకం సాధించాడు. అండర్-12 బాలుర విభాగంలో కొండపాక తెలంగాణ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌కు చెందిన పునీత గౌడ్ లాంగ్ జంప్‌లో కాంస్య పతకం గెలుచుకున్నాడు. ఈ విషయాన్ని సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి కర్రోళ్ల వెంకటస్వామి గౌడ్ తెలిపారు. సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, స్పోర్ట్స్ క్లబ్ కన్వీనర్ పాల సాయిరాం, వెంకటనరసయ్య, పన్యాల రామేశ్వర్ రెడ్డి, ఏరవ్వ అశోక్, సైక్లింగ్ జిల్లా సంఘం అధ్యక్షులు బండారుపల్లి శ్రీనివాసులు, రెజ్లింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కడకంచి ఉప్పలయ్య, శిక్షకులు నిశాంక్ గౌడ్, ప్రభాకర్ తదితరులు పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు.

జాతీయస్థాయి రగ్బీ పోటీలకు ఏడుగురు ఎంపిక



ఎంపికైన బాలికలు, బాలురు



చేగుంట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి రగ్బీ పోటీలకు మెదక్ జిల్లా నుంచి ఏడుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు మెదక్ జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కర్ణం గణేష్ రవికుమార్, మల్లేశ్వరి తెలిపారు. ఈ నెల 5న సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-18 బాలబాలికల రగ్బీ పోటీల నుంచి వీరు ఎంపికయ్యారు. చేగుంట ఎస్టీ స్పోర్ట్స్ రెసిడెన్షియల్ స్కూల్‌కు చెందిన నలుగురు క్రీడాకారులు, తూప్రాన్ బాలుర గురుకుల కళాశాలకు చెందిన ముగ్గురు క్రీడాకారులు జాతీయస్థాయి రగ్బీ పోటీలకు అర్హత సాధించారు. బాలికల విభాగంలో నందిని, దీపిక, సంపూర్ణ, అంకిత ఎంపిక కాగా, బాలుర విభాగంలో విష్ణు శ్రీ చరణ్, రాకేష్, కార్తీక్ ఎంపికయ్యారు. బాలుర విభాగం ఈ నెల 8 నుంచి 10 వరకు, బాలికల విభాగం 12 నుంచి 14 వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో జరిగే జాతీయస్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పాఠశాల నుంచి క్రీడాకారులు జాతీయస్థాయిలో ఎంపిక కావడం పట్ల స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపాల్ సుమతి, బాలుర కళాశాల ప్రిన్సిపల్ తారాసింగ్ హర్షం వ్యక్తం చేశారు.

రియల్ వ్యాపారి మోసం

- కోనాపూర్‌లో 35.19 ఎకరాలు కాజేసేందుకు యత్నం
- తమ కుటుంబ సభ్యుల పేర అక్రమ రిజిస్ట్రేషన్
- 50 ఏళ్ల నుంచి కబ్జాలో ఉన్న రైతులకు బెదిరింపు



కోనాపూర్‌లో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో సదానందం

దౌల్తాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ మండలం కోనాపూర్ గ్రామంలోని 35.19 ఎకరాల భూమిని హైదరాబాద్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి, కాంట్రాక్టర్ పుల్లూరి శ్రీనివాస్‌రావు కాజేయాలని చూస్తున్నట్లు గ్రామ రైతులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోని 134సర్వే నంబర్‌లో మొత్తం 200 ఎకరాల 18 గుంటల భూమి ఉంది. ఇందులో 2016లో కొండపోచమ్మ రిజర్వాయర్‌లో 13 ఎకరాలు పోగా, మిగిలిన భూమిలో 10 ఎకరాలు గంటన కుంట, చిన్న కుంటలు ఉన్నాయి. ఇదే సర్వే నంబర్‌లోని సుమారు 10 ఎకరాల్లో కోనాపూర్ గ్రామానికి చెందిన కొంత మంది రైతులు 50 ఏళ్లుగా ఎటువంటి రిజిస్ట్రేషన్ చేసుకోకుండా సాగు చేసుకుంటున్నారు. ఈ పరిస్థితిని అదునుగా భావించిన పుల్లూరి శ్రీనివాస్‌రావు తన పేరిట 10 ఎకరాల 26 గుంటలు, తన తండ్రి పుల్లూరి రాజేశ్వర్‌రావు పేరిట 10 ఎకరాలు, తన భార్య పుల్లూరి సరిత పేరిట 14ఎకరాల 33 గుంటలను అక్రమంగా నకిలీ పాత పాస్‌బుక్‌లు, నకిలీ 13(బి) ప్రొసీడింగ్‌లను సృష్టించి 2018లో రికార్డుల్లో ఎక్కించుకున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. శ్రీనివాస్‌రావుకు, ఆయన కుటుంబానికి ఆ భూమిపై ఒక్క గుంట కూడా కబ్జా లేదని రైతులు స్పష్టం చేస్తున్నారు. గ్రామానికి ఒకరిద్దరు శ్రీనివాస్‌రావుకు సహకరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు.

సర్వేను అడ్డుకున్న రైతులు

ఈ నెల 5న పుల్లూరి శ్రీనివాస్‌రావు తన భూమిగా పేర్కొంటూ సర్వేయర్లు, అధికారులతో కలిసి 10 ఎకరాలను సర్వే చేసేందుకు రావడంతో రైతులు అడ్డుకున్నారు. తాము సాగు చేసుకుంటున్న భూమిలో సర్వే ఎలా చేస్తారని ప్రశ్నిస్తూ వాగ్వాదానికి దిగారు. తాము శ్రీనివాస్‌రావుకు ఒక్క గుంట భూమి కూడా అమ్మలేదని, తమకు ఆయన ఎవరో తెలియదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి తమకు పట్టా చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై గతంలో ప్రజావాణిలో కూడా ఫిర్యాదు చేశామన్నారు. సమాచారం అందుకున్న సిద్దిపేట ఆర్డీఓ సదానందం, దౌల్తాబాద్, రాయపోల్, తొగుట, బేగంపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు వినకపోవడంతో అధికారులు వెనుదిరిగారు.

న్యాయం చేయాలి..



పుల్లూరి శ్రీనివాస్‌రావుకు, 134సర్వే నంబర్‌కు ఎలాంటి సంబంధం లేదు. మా భూముల్లో సర్వే చేయడానికి రావడం అన్యాయం. ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు శ్రీనివాస్‌రావు, అతని కుటుంబం పేర్లపై ఉన్న ఈ భూములను తొలగించి, మాకు న్యాయం చేయాలి.

- రాజిరెడ్డి, రైతు, కోనాపూర్

గుట్టకాయస్వాహా

కొండలు తొలిచి పరిశ్రమల స్థాపన



రామాయపల్లి శివారులో ఎక్స్‌కవేటర్‌తో తవ్వుతున్న గుట్టలు

- మనోహరాబాద్ మండలంలో కరిగిపోతున్న ప్రకృతి సంపద
- భూములు కోల్పోతున్న స్థానికులు.. ఉపాధి లేక ఆవేదన

మనోహరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ఎత్తైన గుట్టలు, వాటిని పరుచుకునే పచ్చదనం, వాటిని ఆవాసాలుగా చేసుకునే జీవరాశులు, గుట్టలను ఆనుకుని ఉండే పంట పొలాలతో ఉండే ప్రకృతి రమణీయత వర్ణించలేనిది. ఇలాంటి ఆహ్లాద వాతావరణంతో అలలారిన మనోహరాబాద్ మండలంలోని పల్లె శివారులు నేడు పరిశ్రమలకు అడ్డాగా మారిపోయాయి. గుట్టలను తొలిచి, వందలాది ఎకరాల వ్యవసాయ భూములను ఫ్యాక్టరీల ఏర్పాటు పేరుతో కబళిస్తున్నారు. మండల కేంద్రంలోనే కాకుండా, ప్రతీ గ్రామ శివారులోనూ చిన్న, మధ్య తరహా పరిశ్రమలు పుట్టుకొస్తునే ఉన్నాయి. ప్రస్తుతం సుమారు 250కిపైగా పరిశ్రమలు మండలంలో వెలిశాయి. ఈ చర్యలతో ప్రకృతి సమతుల్యత దెబ్బతినడమే కాకుండా, భూములు కోల్పోయిన రైతులు, యువకులు ఉపాధి లేక రోడ్డున పడుతున్నారు. సొంత భూముల్లోనే కూలీలుగా మారిన స్థానికులకు పరిశ్రమల్లో కనీసం పనులు కూడా దొరకడం లేదు.



కొండాపూర్ టీజీఐఐసీ పారిశ్రామికవాడలో పరిశ్రమ కోసం తొలుస్తున్న గుట్ట

పరిశ్రమల విస్తరణ.. భూముల సేకరణ

మెదక్ జిల్లాలో మనోహరాబాద్ మండలం పరిశ్రమలకు కేంద్రబిందువుగా మారుతోంది. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ, పట్టా భూములను సేకరించి పరిశ్రమలకు కేటాయించడంతో ఈ విస్తరణ జరిగింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 1300 ఎకరాల వరకు భూములను పరిశ్రమల ఏర్పాటు కోసం సిద్ధం చేసింది. ముఖ్యంగా పోచారం, రంగయ్యపల్లి, కొనాపూర్, పర్కిబండ, వెంకటాపూర్ అగ్రహారం, ధర్మరాజ్‌పల్లి, పాలాట, రామయ్యపల్లి వంటి గ్రామాల్లో ఈ భూములను సేకరించారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంకా కొత్త భూములను కేటాయించలేదు. గత ప్రభుత్వం భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించింది. పర్కిబండ గ్రామంలో 350 ఎకరాల భూమిని సేకరించి, కేంద్ర ప్రభుత్వం లాజిస్టిక్ పార్క్ నిర్మాణం కోసం పునాదులు వేస్తోంది.

గుట్టలు కరిగి.. వ్యవసాయం తగ్గి

మనోహరాబాద్ మండలంలో సుమారు వెయ్యి ఎకరాలకుపైగా పరిశ్రమలు ఉన్నాయి. వీటితో పాటు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు, పట్టా భూములు, ముఖ్యంగా గుట్టలు ఉన్న ప్రాంతాలను సేకరించి పరిశ్రమల నిర్మాణాలను చేపడుతున్నారు. దీంతో మండలంలో ఎక్కడ చూసినా గుట్టలు కరిగిపోతూ, వాటి స్థానంలో పరిశ్రమలు వెలుస్తున్నాయి. ఒకప్పుడు పచ్చగా, గుట్టలతో నిండిన ఈ ప్రాంతం, ఇప్పుడు పరిశ్రమల కుప్పగా మారుతోంది. ఇలాగే కొనసాగితే, భవిష్యత్తులో ప్రకృతి సంపద పూర్తిగా కనుమరుగవుతుందని గ్రామాల్లోని పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలం పూర్తిగా పరిశ్రమలమయం కావడంతో వ్యవసాయ భూమి తగ్గిపోతుంది. దీంతో గ్రామాల్లోని రైతులు, యువకులు, కూలీలుగా మారుతున్నారు. ఒకప్పుడు పంటలు పండించి జీవనం సాగించిన రైతులు, ఇప్పుడు అదే భూముల్లో నిర్మించిన పరిశ్రమలలో కూలీలుగా పనిచేసుకుంటూ జీవించాల్సిన దుస్థితి ఏర్పడిందని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు.

భూములు కోల్పోయిన వారికి ఉపాధి చూపాలి



నేను పొలం పనులు చేసుకుంటూ జీవించేవాన్ని. గత ప్రభుత్వం పరిశ్రమల కోసం గ్రామంలో సుమారు 43 ఎకరాల భూమిని తీసుకుంది. దీంతో ఉన్న కొంత పొలం కోల్పోయాను. ఇప్పుడు భూములు లేక కూలీ పనులు చేయాల్సి వస్తుంది. పరిశ్రమల వారు మా భూముల్లో నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ స్థానికులైన మాకు ఉపాధి కల్పించడం లేదు. అధికారులు భూములు కోల్పోయిన వారికి ఉపాధి చూపించాలి.

- గొల్ల యాదగిరి, రైతు, రంగయ్యపల్లి గ్రామం

పరిశ్రమల్లో స్థానికులకే ఉపాధి కల్పించాలి



మండలంలో వందల ఎకరాల్లో పరిశ్రమలు వెలుస్తున్నాయి. మండలంలోని ప్రతీ గ్రామం నుంచి ప్రభుత్వం భూములు తీసుకున్నది. కానీ, ఇక్కడి యువతకు స్థానిక పరిశ్రమలలో అవకాశం కల్పించడం లేదు. ఇతర రాష్ట్రాల వారికే అవకాశాలు కల్పిస్తున్నారు. స్థానిక పరిశ్రమలలో మండల యువతకు ఉపాధి కల్పించే విధంగా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి

- వెంకట్‌రెడ్డి, మనోహరాబాద్

కొనసాగుతున్న ఆషాఢి ఉత్సవాలు



రుక్మిణి సమేత పాండురంగడు

మర్కుక్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండలం పాండురంగ ఆశ్రమంలో ఆషాఢి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా భక్తజన సంద్రంతో ఆశ్రమం కిక్కిరిసిపోయింది. భగవన్నామస్మరణతో ప్రాంగణం మార్మోగింది. పాండురంగ ఆశ్రమ నిర్వాహకులు చేపట్టబోయే శతకోటి హరే రామ నామజప యజ్ఞంలో భాగస్వాములవుతున్న 65 గ్రామాలకు చెందిన భగవత సేవా సమాజం శాఖల సభ్యులు శోభాయాత్రలతో ఆశ్రమానికి చేరుకొని భక్తజన సమ్మేళనంలో పాల్గొన్నారు. 108 గ్రామాలలో భజన మండలిని ఏర్పాటు చేస్తూ హరే రామ నామ స్మరణ ద్వారా భక్తి చైతన్యాన్ని ప్రచారం చేస్తున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ రసరాజశర్మ, ఒకేసారి వందలాది మంది స్నానం ఆచరించే విధంగా ప్రత్యేక పైప్‌లైన్లను ఏర్పాటు చేశారు. ఆదివారం రాంపూర్ పీఠాధీశ్వరులు మాధవానంద సరస్వతిస్వామివారు విచ్చేసి పాండురంగ స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారు స్వయంగా భజన చెబుతూ భక్తులను ఆధ్యాత్మిక మార్గంలో ఓలలాడించారు. సాదమంటపంపై సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగాయి. రాష్ట్రం నలుమూలలతో పాటు హైదరాబాద్ నుంచి వచ్చిన సంగీత, సాహిత్య, సాంస్కృతిక కళాకారులు తమ ఆధ్యాత్మిక ప్రదర్శనల ద్వారా స్వామివారికి వందనం సమర్పించుకున్నారు. ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఇతర ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు.



స్వామివారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

పర్యావరణ పరిరక్షణకు క్విజ్

- ఎన్ఎస్‌పీఎస్-2025 రిజిస్ట్రేషన్లు షురూ
- ఐదు విభాగాల్లో పర్యావరణంపై ఆన్‌లైన్ క్విజ్
- ఆగస్టు 21 వరకు నమోదుకు అవకాశం
- జిల్లావ్యాప్తంగా విద్యాశాఖ అవగాహన కార్యక్రమాలు

సిద్దిపేట కల్చరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): 'ఈ నేచర్‌లో ఏది మన సొంతం కాదు. మనం భూమి మీద టెనెంట్స్ మాత్రమే. కొన్నాళ్లు ఉండటానికి వచ్చాం. ఉండి ఏది డిస్టర్బ్ చేయకుండా వెళ్లిపోదాం. తర్వాత తరానికి ఉన్నది ఉన్నట్లుగా ఇచ్చేయాలి.' ఇది ఒక తెలుగు సినిమాలోని డైలాగ్ . ప్రస్తుతం ప్రకృతి విధ్వంసాన్ని చూస్తే ఆ డైలాగ్ అక్షర సత్యంగా అనిపిస్తుంది. గత 200 ఏళ్లలో జరిగిన ప్రకృతి విధ్వంసం కొన్ని మిలియన్ సంవత్సరాల్లో ఎప్పుడూ జరగలేదని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు. ప్లాస్టిక్ వాడకం, డిస్పోజబుల్స్, శిలాజ ఇంధనాల వినియోగం, కాలుష్యం, అడవుల నరికివేత వంటి మానవ తప్పిదాల వల్ల ప్రకృతికి పూడ్చలేని లోటు ఏర్పడుతుందని హెచ్చరిస్తున్నారు. ఫోన్‌లో టాక్‌టైమ్ పూర్తయినట్టే భూమి లైఫ్‌టైమ్ మనిషి చేస్తున్న ప్రకృతి విధ్వంసంతో తరిగిపోతుందని, రాబోయే తరాలకు ప్రకృతిని ఎలా కాపాడుకోవాలో నేర్పాల్సిన అవశ్యకత ఏర్పడిందని నేచర్ లవర్స్ అభిప్రాయపడుతున్నారు.

ఎన్ఎస్‌పీఎస్ ఆన్‌లైన్ క్విజ్ పోటీ

వాతావరణ మార్పుల నుంచి రక్షణకు, విద్యార్థుల్లో పర్యావరణ నైపుణ్యాలు పెంపొందించడానికి, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చడానికి కేంద్ర విద్యా, పర్యావరణ మంత్రిత్వ శాఖల సహకారంతో పర్యావరణ గతివిధి (పీఎస్‌జీ) హరిత్ ద వే ఆఫ్ లైఫ్ అనే థీమ్‌తో దేశవ్యాప్తంగా ఎన్ఎస్‌పీఎస్ - 2025 (నేషనల్ స్టూడెంట్స్ పర్యావరణ కాంపిటీషన్)ను నిర్వహిస్తోంది. జూలై 1 నుంచి ఆగస్టు 21 వరకు ఈకో మిత్రం మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేదు. హిందీ, ఇంగ్లీష్‌తో పాటు పలు భాషల్లో క్విజ్ ఉంటుంది. మొక్క నాటుతున్న, నీరు ఆదా చేస్తున్న లేదా వ్యర్థాలను వేరు చేస్తున్న సెల్ఫీని తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఫలితాలను ఆగస్టు 31న ప్రకటిస్తారు. పాల్గొన్న ప్రతి విద్యార్థికి ఈ-సర్టిఫికెట్ అందజేస్తారు. విద్యా సంస్థలకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హైమావతి, విద్యాశాఖ అధికారులు

ఐదు విభాగాల్లో పోటీ

ఈ క్విజ్ పోటీలో విద్యార్థులు మాత్రమే కాకుండా ప్రకృతి ప్రేమికులందరూ పాల్గొనవచ్చు. మొదటి విభాగంలో 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులు, రెండవ విభాగంలో 6వ తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులు, మూడవ విభాగంలో 9వ తరగతి నుంచి పదోతరగతి విద్యార్థులు, నాల్గవ విభాగంలో డిగ్రీ, పీజీ, పరిశోధన విద్యార్థులు, ఐదవ విభాగంలో సాధారణ పౌరులు, పర్యావరణ ప్రేమికులు పాల్గొనవచ్చు. గత నాలుగేళ్లుగా దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఈ క్విజ్ పోటీల్లో పాల్గొంటున్నారు. అయితే సిద్దిపేట జిల్లా నుంచి ప్రాతినిధ్యం అంతగా లేదు. ఈ సంవత్సరం పెద్ద ఎత్తున జిల్లా నుంచి పోటీలో పాల్గొనేలా విద్యాశాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సిద్దిపేట కలెక్టర్ హైమావతి ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని సూచించారు.

అవగాహన కల్పించాలి

పిల్లలకు ప్రకృతికి హాని చేసే అంశాల పట్ల విద్యార్థి దశ నుండే అవగాహన కల్పించాలి. ఇప్పటికే చాలా ఆలస్యమైంది. ఎన్ఎస్‌పీఎస్-2025లో అందరూ భాగస్వామ్యం అయ్యేలా చూడాలి. జిల్లాలోని ప్రతి పాఠశాల నుంచి విద్యార్థుల పాల్గొనేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలి.

- భాస్కర్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్, నేషనల్ గ్రీన్‌కోర్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్

మెదక్ చర్చిని సందర్శించిన ఐఏఎస్ నవీన్ నికోలాస్

మెదక్ కల్చరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ చర్చిని ఆదివారం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, ఐఏఎస్ నవీన్ నికోలాస్ సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చర్చి మత పెద్దలు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆయన వెంట చర్చి కమిటీ సభ్యులు టి. శాంతయ్య, సామ్సన్ బానీ, సువాన్, రూపేందర్ ఉన్నారు. అనంతరం మెదక్ జిల్లా పీఈటీ, పీడీలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మెదక్‌లోని కేజీబీవీలు, మోడల్ స్కూల్స్‌ల్లో స్పోర్ట్స్ అకాడమీలను నెలకొల్పాలని ఆయనకు విన్నవించారు. కార్యక్రమంలో పెటా-టీఎస్ మెదక్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, నాగరాజు పీడీలు మాధవరెడ్డి, రవి, రూపేందర్, మహిపాల్, మనోహర్, లక్ష్మణ్, ప్రభాకర్, హరీష్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



రెండేళ్లుగా బడికి తాళం

డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయురాలు.. రంజానాయక్ తండాలో మూతపడిన పాఠశాల



రేగోడు మండలం రంజా తండాలో మూతబడిన బడి

రేగోడు జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య, వసతులు, ఉచిత భోజనం, పాఠ్యపుస్తకాలు అందిస్తున్నప్పటికీ అధికారుల పర్యవేక్షణ లోపం పాఠశాలలకు శాపంగా మారుతుంది. రేగోడు మండలంలోని రంజానాయక్ తండా ప్రాథమిక పాఠశాల రెండేళ్లుగా మూతపడింది. ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయురాలిని డిప్యూటేషన్‌పై పక్క జిల్లాకు పంపించడంతో బడికి తాళం పడింది.

రేగోడు మండలంలో ఇప్పటికే ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. సగానికిపైగా ఒకే ఉపాధ్యాయులతో కొనసాగుతున్నాయి. అత్యవసర పరిస్థితిలో ఉపాధ్యాయులు సెలవుపై వెళ్తే ఆరోజు ఆ బడికి సెలవు ప్రకటించాల్సిందే. అలాంటి పరిస్థితులు ఉన్న రేగోడు మండలంలో ఉపాధ్యాయులను ఇతర జిల్లాలకు డిప్యూటేషన్ వేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రంజానాయక్ తండా పాఠశాల మూతపడడంతో అక్కడి విద్యార్థులను బురన్‌వాడీ తండా పాఠశాలకు పంపించారు. రంజానాయక్ తండాలో 20 మంది విద్యార్థులు ఉండగా, ప్రస్తుతం ఐదుగురు మాత్రమే బురన్‌వాడీ తండాకు వెళ్లి చదువుతున్నారు. మిగిలిన విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు, ఇతర పాఠశాలకు వెళ్తున్నారని తండావాసులు తెలిపారు.

చాలా మంది పిల్లలు తండాలోనే తిరుగుతున్నారు



రంజానాయక్ తండాలో సర్కారీ బడి రెండేళ్లుగా మూతబడింది. పిల్లలను పక్క తండా బురన్‌వాడీ పాఠశాలకు పంపిస్తున్నాం. చాలామంది పిల్లలు బడికి పోకుండా తండాలోనే తిరుగుతున్నారు.

-రవినాయక్, రంజానాయక్‌తండా

వేర్వేరుగా రిజిస్టర్లు

రంజానాయక్ తండా నుంచి వచ్చిన విద్యార్థులకు చదువుతోపాటు బుక్స్ మధ్యాహ్న భోజనం పెడ్తున్నాం. బురన్‌వాడీ, రంజానాయక్ తండాల విద్యార్థులకు వేర్వేరుగా రిజిస్టర్లను నమోదు చేస్తున్నాం. రంజా తండా నుంచి అందరు విద్యార్థులు సరిగా రాలేకపోతున్నారు.

- శిరీష, హెచ్ఎం బురన్‌వాడీతండా పాఠశాల

ఎప్‌సెట్ కౌన్సెలింగ్ పూర్తి

నంగునూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నంగునూరు మండలం రాజగోపాలపేట పాలిటెక్నిక్ కళాశాలలో బీటెక్ కోర్సుల ప్రవేశానికి నిర్వహిస్తున్న ఎప్‌సెట్ కౌన్సిలింగ్ ఆదివారం ముగిసినట్లు ప్రిన్సిపల్ గోవర్ధన్ తెలిపారు. మొత్తం 1833 విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరుకాగా, ఆదివారం ఒక్కరోజే 215 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించినట్లు ఆయన పేర్కొన్నారు. స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలించి, లాగిన్ ఐడీ కేటాయించి వెబ్ ఆప్షన్స్‌పై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కౌన్సిలింగ్ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన అభ్యర్థులకు, వారి తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. కళాశాల అధ్యాపకుడు శ్రీ అభినవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రక్రియలో సిబ్బంది సయ్యద్ షేహబాజ్, పాతూరు శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ, రాజు, విజయ్ కుమార్, శ్రీనివాస్, రాజమౌళి, మధుబాబు, సంతోష్, నవీన కిషోర్, ధనరాజ్, కవిత, మంజుల, వాణి, దీపిక, భాగ్యలక్ష్మి, బాలమణి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కౌన్సెలింగ్‌లో నిర్వహిస్తున్న సిబ్బంది

న్యూస్ బాక్స్

ఎంపీని కలిసిన నాయకులు



రఘునందన్‌రావుతో బీజేపీ నాయకులు

జిన్నారం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : వైద్య చికిత్స చేయించుకున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావును బీజేపీ జిల్లా, మండల నాయకులు ప్రతాప్‌రెడ్డి, జగన్‌రెడ్డి. రాజిరెడ్డి, శ్రీనివాస్, వివిధ గ్రామాల నాయకులు ఆదివారం కలిశారరు. అంతకుముందు జిన్నారంలోని పార్టీ కార్యాలయంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించాచు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణసింగ్, రమేష్, సీతారాజు, మహేష్ యాదవ్, బుక్క భిక్షపతి, ప్రవీణ్, వికాస్‌సింగ్ పాల్గొన్నారు.

ఒకేషనల్ కోర్సుల బోధనకు దరఖాస్తుల ఆహ్వానం

కోహీర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా ప్రవేశపెట్టిన ఎలక్ట్రికల్ టెక్నాలజీ (ఈటీ) కోర్సులు బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు దిగ్వాల్ గ్రామంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్/జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాములు తెలిపారు. వొకేషనల్ పోస్టులకు పూర్తిగా తాత్కాలిక పద్ధతిలో నియామకాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 8న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ గురుకుల విద్యాలయంలో డెమో ఉంటుందని తెలిపారు. ఎంపికైన వారికి అనుభవాన్ని బట్టి గరిష్ఠంగా రూ.48 వేల వేతనం ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు సొసైటీ అధికారిక వెబ్‌సైట్స్ సంప్రదించాలన్నారు. లేదా 04023391598, 7396041646 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

గతుకుల రోడ్డుకు మరమ్మతులు



పూసల్‌పాడ్ శివారులో రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

నాగల్‌గిద్ద, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పూసల్‌పాడ్ శివారు నుంచి మోర్గి చౌరస్తా వరకు రోడ్డు గతుకులమయంగా ఏర్పడడంతో పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు ఆదేశించారు. దీంతో వారు ఆదివారం రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు.

నర్సాపూర్ నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సు

నర్సాపూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ ఆర్టీసీ డిపో నుంచి ప్రముఖ అరుణాచలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేకంగా బస్సు నడుపుతున్నామని, యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ సురేఖ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నర్సాపూర్ నుంచి నాలుగు పుణ్యక్షేత్రాలైన కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, కంచి, అరుణాచలం యాత్రకు వెళ్లేవారి కోసం ఈ ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఒక్కో ప్రయాణికుడు రూ.4 వేలు చెల్లించాల్సి ఉంటుందని, పూర్తి వివరాలకు 7780775815, 9494825746 నంబర్లలో సంప్రదించాలని మేనేజర్ సూచించారు.

కొనసాగిన ఇంటింటి సర్వే



ఇస్లాంపూర్‌లో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్న ఆశావర్కర్లు

తూప్రాన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామంలో ఆదివారం సైతం వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన పలువురికి డెంగీ పాజిటివ్ రావడం, జ్వరాలు రావడంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. శనివారం వైద్య శిబిరం నిర్వహించి, ఇంటింటా జ్వర సర్వే నిర్వహించారు. ఆదివారం ఇంటింటికి వెళ్లి జ్వరాలపై ఆరా తీశారు. జ్వరం బారిన పడిన వ్యక్తుల రక్త నమూనాలు సేకరించారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

ములుగు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు, నియోజకవర్గం బాధ్యుడు బుడిగె మహేష్ పిలుపునిచ్చారు. ఆదివారం ములుగులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జూలై 7న జిల్లా వ్యాప్తంగా ప్రతి ఒక్కరూ సమయాన్ని పాటించి ఉదయమే అన్ని గ్రామాల్లో కమిటీ సభ్యులు, కులస్తులతో కలిసి ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు.

మొహర్రంలో పాల్గొన్న నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఆదివారం నిర్వహించిన మొహర్రం వేడుకల్లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ తూర్పు నిర్మలాజగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో జరిగిన పీర్ల ఊరేగింపులో వారు పాల్గొన్నారు. ఈ మేరకు రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం వద్ద ప్రత్యేకంగా షర్బత్‌ను పంపిణీ చేశారు.



మొహర్రం సందర్భంగా షర్బత్ పంపిణీ చేస్తున్న నిర్మలాజగ్గారెడ్డి



పీర్ల ఊరేగింపులో పాల్గొన్న జగ్గారెడ్డి

శ్యామా ప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయం



మెదక్ అర్బన్: శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మల్లేశంగౌడ్

మెదక్ అర్బన్/పెద్దశంకరంపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జన సంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ భారతదేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశం గౌడ్ కొనియాడారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. శ్యామా ప్రసాద్ జీవితం దేశ ప్రజలకు స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం పార్టీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి నీళ్ల పోశారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుభాష్‌గౌడ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కాశీనాథ్, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. పెద్దశంకరంపేటలోని బీజేపీ కార్యాలయంలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి మండల అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ పూలమాలవేసి నివాళులర్పించారు.

రింగ్‌రోడ్లతో ట్రాఫిక్ సమస్యలు దూరం

- నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్/నాగల్‌గిద్ద/మనూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ పట్టణం చుట్టూ నిర్మిస్తున్న రింగురోడ్డు, ఔటర్ రింగ్‌రోడ్లతో పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు దూరమవ్వడంతో పాటు వివిధ మండలాల వారికి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించడానికి దూర భారం తగ్గుతుందని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మండల పరిధిలోని జగన్నాథ్‌పూర్ సమీపంలోని 161బీ జాతీయ రహదారి నుంచి పంచగామకు నిర్మిస్తున్న లింక్ రోడ్డు పనులను ఆదివారం భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనూరు క్రాస్ రోడ్ నుంచి కంగ్టి, సిర్గాపూర్, ఖాంజీపూర్ రోడ్ల మీదుగా ఖేడ్- నిజాంపేట రోడ్డును కలుపుతూ ఫార్మేషన్ రింగ్ రోడ్డు పూర్తికాగా.. దాన్ని బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయనున్నామన్నారు. జూకల్, అంత్వార్, జగన్నాథ్‌పూర్, శెల్గిరా శివార్ల మీదుగా హంక్రాన.జి వరకు ఔటర్ రింగ్ రోడ్డు కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, నరేష్‌యాదవ్, షైనొద్దీన్, విజయ్, రాములు, వీరొశెట్టి, విఠల్‌యాదవ్, సుకుమార్, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను వారు సన్మానించారు. కాగా ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన ఖేడ్ నియోజకవర్గానికి చెందిన విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించి సన్మానించారు. అలాగే మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం తుర్కపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. మండల పరిధిలోని అనంత్‌సాగర్‌లో కాంగ్రెస్ నాయకుడు శంకర్ రెడ్డి మృతిచెందడంతో వారి కుటుంబీకులను పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీటీసీ దత్తుగౌడ్, నాయకులు పాల్గొన్నారు. మనూరు మండలం బోరంచలో ఇందిరమ్మ ఇళ్లకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి భూమి పూజ చేశారు. అనంతరం గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. బోరంచలోని పాపమ్మ కాలనీకి దివంగత కిష్టారెడ్డి నామకరణం చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ నారాయణఖేడ్ అధ్యక్షుడు బోజిరెడ్డి, పటోళ్ల లోకేష్ రెడ్డి, న్యాయవాది సంగన్న, సిద్ధారెడ్డి, దిలీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఖేడ్‌లో లింక్ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డిని సన్మానిస్తున్న రైతులు

బహుజనుల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ కృషి అమోఘం



పస్తాపూర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మాణిక్‌రావు



కందిలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న అంబేడ్కర్ సంఘం నాయకులు

జహీరాబాద్/కంది/సంగారెడ్డి రూరల్/తూప్రాన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర సమరయోధుడు, మాజీ ప్రధానమంత్రి డా.జగ్జీవన్‌రామ్ దళిత, బహుజనుల అభ్యున్నతికి చేసిన కృషి అమోఘమని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఆదివారం నాయకులు, అభిమానులు, వివిధసంఘాల, పార్టీల నాయకులు పాల్గొని నివాళ్లర్పించారు. ఇదిలాఉండగ ఎస్సీ కార్పొరేషన్ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నరోత్తం, తదితరులు పాల్గొని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. గొప్ప సంఘ సంస్కర్త డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ అని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బూడిద కుమార్ అన్నారు. కందిలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆదివారం జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా అంబేడ్కర్ సంఘం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సంగారెడ్డిలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి సమతా సంఘం నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సాహసం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పారం ప్రకాష్, తెలంగాణ ప్రదేశ్ ఎరుకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు, సంఘం గౌరవాధ్యక్షుడు డప్పోళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు. తూప్రాన్ పట్టణంలోని బస్టాండ్ వద్ద ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి అంబేడ్కర్ సంఘం నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు పసుల నర్సింగ్‌రావు, కార్యదర్శి గజ్జెల కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదల తొలగింపు

హత్నూర, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : హత్నూర మండలం సికింద్లాపూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా పెరిగిన పొదలు ఇబ్బందిగా ఉండడంతో గ్రామ పెద్దలు, యువత ముందుకు వచ్చి ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. అధికారులకు చెప్పినా.. ఎవరు పట్టించుకోకపోవడంతోనే స్వయంగా తొలగిస్తున్నామని స్థానిక యువకులు తెలిపారు. రాత్రివేళలో దౌల్తాబాద్ నుంచి సికింద్లాపూర్ వెళ్లే ప్రధాన రహదారి ఇరువైపులా ముళ్లపొదల వల్ల తరచూ ప్రమాదాలు సైతం చోటు చేసుకున్నాయని యువకులు చెప్పారు.

పెంపుడు జంతువులతో అప్రమత్తంగా ఉండాలి

- మెదక్ పశువైద్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డా. వెంకట్



నర్సాపూర్ పశుసంవర్ధకశాఖ సబ్‌డివిజన్ కార్యాలయంలో కుక్కలకు టీకాలు వేస్తున్న డాక్టర్ వెంకట్

మెదక్ అర్బన్/నర్సాపూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : పెంపుడు జంతువులతో అప్రమత్తంగా ఉండాలని మెదక్ పశువైద్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డా.వెంకట్ సూచించారు. ఆదివారం అంతర్జాతీయ జూనోసెస్ దినోత్సవం సందర్భంగా స్థానిక పశువైద్య శాలలో ఉచిత రేబిస్ వ్యాధి నివారణ టీకా శిబిరాన్ని నిర్వహించారు. కుక్కల పెంపకందారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 78 పెంపుడు కుక్కలు, 15 పిల్లులకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలను వేశారు. పెంపుడు కుక్కలకు క్రమం తప్పకుండా టీకాలు, వ్యాక్సిన్‌లు వేయించాలని సూచించారు. వారంరోజుల పాటు టీకా కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డా.లక్ష్మణ్, జేవీవో సల్లావొద్దిన్, వీఏ రాకేష్ తదితరులు పాల్గొన్నారు. పెంపుడు కుక్కల నుంచి మనుషులకు సోకే రేబిస్ వ్యాధి రాకుండా ఉండేందుకు కుక్కలకు ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ వెంకటయ్య తెలిపారు. ఆదివారం జూనోసిస్ దినోత్సవం సందర్భంగా నర్సాపూర్ పశు సంవర్ధకశాఖ సబ్ డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన టీకాలు వేసే కార్యక్రమంలో ఆయన పాల్గొని, స్థానిక ఏడీ డాక్టర్ జనార్ధన్‌రావుతో కలిసి పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. నర్సాపూర్ సబ్ డివిజన్ కార్యాలయం వద్ద 65 కుక్కలకు టీకాలు వేసినట్లు స్థానిక ఏడీ జనార్ధన్‌రావు తెలిపారు.

కాసాలలో ఘనంగా పస్కా పండుగ



కార్యక్రమంలో మాట్లాడుతున్న కాంతారావు

హత్నూర, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కాసాల దక్షిణ ఇండియా సంఘం (సీఎస్ఐ) ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా పస్కా పండుగ జరుపుకున్నారు. సంఘ సభ్యులందరూ కలిసి చర్చి నుంచి గ్రామ శివారులో గల పచ్చని పొలాలకు నూతన వస్త్రాలు ధరించి పిల్లలు, పెద్దలు పాటలు పడుతూ బయలుదేరారు. ఈ సందర్భంగా రేవ బి.కాంతారావు, రెవ అమృతరావు, గురువులు మాట్లాడుతూ ఐరోపా దేశంలో ఇశ్రాయేలీయులు బానిసత్వంలో ఉన్నప్పుడు దేవుడు మరణాన్ని తప్పించడానికి పస్కాను ఏర్పాటు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్టరేట్ స్టువర్డ్ రోడ్డె లక్ష్మయ్య, పాస్టరేట్ కమిటీ పాముల భాస్కర్, నాయకోటి ప్రభాకర్, సంఘ పెద్దలు సామేల్, సంజీవరావు, వివేకానంద సాగర్, భాస్కర్, సుభాష్, అలెగ్జాండర్, సుధాకర్, గిరి ప్రసాద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలు హాస్యాస్పదం

- మున్సిపల్ మాజీ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్



విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

రామాయంపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మా హయాంలో ఎంతో సాధించామని, కానీ అభివృద్ధి కాలేదని కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్ అన్నారు. ఆదివారం సొసైటీ చైర్మన్ బాదే చంద్రం, పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. పద్మారెడ్డి తెలంగాణ ఉద్యమంలో పదవి త్యజించారన్నారు. అలుపెరగని పోరాటం నిర్వహించి ఎస్పీ, కలెక్టర్ కార్యాలయాలే కాకుండా మెదక్ అభివృద్ధికి శ్రమించారన్నారు. అలాంటి నాయకురాలిపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు అహ్మద్, రాజుయాదవ్, మర్కు దత్తు, ఐలయ్య, ఉమా, మల్యాల శ్రీకాంత్, సాగర్, పాతూర్ సిద్ధిరాములు, విద్యాసాగర్ పాల్గొన్నారు.

వెంకటకిష్టాపూర్‌లో కొనసాగుతున్న జాతర



భక్తులకు దర్శనమిస్తున్న రుక్మిణీ పాండురంగస్వామి

పుల్‌కల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : చౌటకూర్ మండలం వెంకటకిష్టాపూర్ (దేవుని అంగడిపేట)లో శ్రీ రుక్మిణీ పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. 5న ప్రారంభమైన ఉత్సవాలు 10వ తేదీవరకు కొనసాగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రుక్మిణీ పాండురంగస్వామి వారికి అభిషేకం, అలంకరణ, స్వామివారి నిజ పాద స్పర్శ దర్శనం, మహాన్యాస పూర్వ ఏకాదశ రుద్రాభిషేకం, విశేష అలంకరణ, రాజోపచార పూజ, తీర్థప్రసాద వితరణ, అనంతరం పల్లకీసేవ నిర్వహించారు. తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఉపవాస దీక్షలతో గడిపారు. దీంతో పాటు మండల కేంద్రమైన చౌటకూర్‌లోని విఠలేశ్వరాలయంలో తొలి ఏకాదశి ఉత్సవాలు జరిపారు.

సుదీర్ఘ పోరాటాలతోనే ఏబీసీడీ వర్గీకరణ

- ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా ఇన్‌చార్జి గుజ్జన విజయ్‌మాదిగ



బాలరాజ్‌కు నియామకపత్రం అందజేస్తున్న విజయ్‌మాదిగ

చేగుంట, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : సుదీర్ఘ పోరాటంతో ఏబీసీడీ వర్గీకరణ సాధించుకున్నామని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు, మెదక్ జిల్లా ఇన్‌చార్జి గుజ్జన విజయ్‌మాదిగ పేర్కొన్నారు. చేగుంట మండలం చందాయిపేట ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని విజయ్ మాదిగ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎర్ర బాలరాజ్‌మాదిగ, ఉపాధ్యక్షుడిగా దప్పు కుమార్‌తో పాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విజయ్‌మాదిగ మాట్లాడుతూ నేడు మందకృష్ణ మాదిగ పుట్టినరోజు సందర్భంగా అన్నిగ్రామాల్లో జెండావిష్కరణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఉపన్నగళ్ల మురళీమాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొలుపుల రామస్వామి, మండల కోశాధికారి బక్క సాయిబాబామాదిగ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ప్లాస్టిక్ మూతల కలకలం



మొగుడంపల్లికి వెళ్లే రోడ్డుపై పడవేసిన ప్లాస్టిక్ మూతలు

జహీరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలానికి వెళ్లే రోడ్డుపై రాయిపల్లితండా చౌరస్తా వద్ద ఆదివారం ప్లాస్టిక్ మూతలు పడవేయడంపై ప్రయాణీకులు ఆందోళన చెందారు. కొన్నింటిని రోడ్డుపై పడేయగా.. మరికొన్ని మూతల సంచులను పక్కనే ఉన్న హోటల్‌లో పెట్టారు. కేవలం మూతలు మాత్రమే ఉండి, బాటిళ్లు లేకపోవడంతో రసాయనాల స్మగ్లింగ్ కోసం తెచ్చారని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మూతలు ఉన్న సంచిపై సుందర్‌నగర్-ఎర్రగడ్డ, హైదరాబాద్ అని ఉంది.

'పని గంటల పెంపు జీవోను రద్దు చేయాలి'

జహీరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం ఉన్న 8 గంటల పని విధానాన్ని 10 గంటలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవోను రద్దును చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు మైపాల్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైఖరిని నిరసిస్తూ ఆదివారం జహీరాబాద్ పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి జీవో కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని గంటల పెంపు ప్రభావంతో కార్మికులు తీవ్ర ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వాలు యాజమాన్యాలకు వత్తాసు పలకడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవోను రద్దు చేయకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



కంది మండలం కాశీపూర్‌లో పీర్ల ఊరేగింపు

కంది/పుల్‌కల్/చిన్నశంకరంపేట/అల్లాదుర్గం/పెద్దశంకరపేట/నర్సాపూర్/శివ్వంపేట/తూప్రాన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : కంది మండలంలోని కాశీపూర్, కలివేముల, మక్తా అల్లూరు, కంది, కవలంపేట, చేర్యాల, మామిడిపల్లి గ్రామాల్లో మొహర్రం వేడుకలు నిర్వహించారు. పుల్‌కల్, చౌటకూర్ మండలాల్లో మొహర్రం పండుగను ఘనంగా జరుపుకున్నారు. చిన్నశంకరంపేట మండలంలోని టీమాందీపూర్, అంబాజీపేట, మిర్జాపల్లి, మడూర్ గ్రామాల్లో, అల్లాదుర్గం మండలం, పెద్దశంకరంపేట మండలం, నర్సాపూర్ పట్టణంతో పాటు పలు గ్రామాల్లో పీర్ల పండుగను జరుపుకున్నారు. శివ్వంపేట మండలంలోని శివ్వంపేటతో పాటు బిజిలిపూర్, నవాబ్‌పేట, దొంతి గ్రామంల్లో పీర్లను ఊరేగించారు. మునిపల్లి మండలం ఖమ్మంపల్లిలో, తూప్రాన్ పట్టణంతోపాటు, యావాపూర్, ఘనపూర్ గ్రామాల్లో మొహర్రం వేడుకలు చేపట్టారు.



పీర్ల ఊరేగింపులో మాజీ జడ్పీటీసీ మహేష్‌గుప్తా



కల్హేర్‌లోని రామాలయంలో భజనలు చేస్తున్న భక్తులు

ఘనంగా తొలి ఏకాదశి

తొలి ఏకాదశిని మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

- న్యూస్ నెట్‌వర్క్



పెద్దశంకరంపేటలో స్వామికి అభిషేకం చేస్తున్న దృశ్యం